క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో జర్నలిజం విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ: డిగ్రీ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జర్నలిజం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.నీలం రమేష్‌రెడ్డి తెలిపారు. బీఏ జర్నలిజం కోర్సులో గత నాలుగు సెమిస్టర్లలో వరుసగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

మంచి ఫలితాలు సాధించాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

అమరాపురం: పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో చదువుకుని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళపతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో పదోతరగతి విద్యార్థులు సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మంజునాథ స్వామి అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు చేశారు. విద్యార్థుల చేత సరస్వతీ మంత్రాన్ని పఠనం చేయించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

క్రికెట్ టోర్నీ విజేత 'స్పాటాన్'


విజేతకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

పెనుకొండ: క్రీడల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని బాబయ్య దర్గా పీఠాధిపతి కుమారుడు నజర్‌హుసేని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలను మంగళవారం నిర్వహించారు. సీఎస్‌కే జూనియర్స్ వర్సెస్ స్పాటాన్ జట్లు తలపడగా స్పాటాన్ జట్టు విజయం సాధించింది. విజేతలకు ట్రోఫీ అందజేసిన నజర్‌హుసేని క్రీడల ప్రాధాన్యతను వివరించారు.

అగ్నికి ఆహుతైన తోట

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో రైతు వడ్డే నాగరాజుకు చెందిన తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గ్రామ శివారులో నాగరాజుకు 5 ఎకరాల భూమి ఉండగా మామిడి, కొబ్బరి, టేకు చెట్లు ఉన్నాయి. మంగళవారం ఉదయం దుండగులు నిప్పు పెట్టడంతో ఎండు గడ్డికి అగ్గి రాజుకుంది. దీంతో మామిడి, కొబ్బరి, టేకు చెట్లు అగ్గికి మాడి మసిబారాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. లక్ష రూపాయల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు నాగరాజు వాపోయారు.

'మత్తు' కు దూరంగా ఉండాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సాయంత్రం సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హైవేపై కారు బోల్తా



పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై మంగళవారం కారు బోల్తా పడింది. స్థానికుల వివరాలమేరకు.. ధర్మవరం నుంచి బెంగళూరు వెళ్తున్న కారు జాతీయ రహదారిపై గుట్టూరు కనుమ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయట పడటతో ప్రమాదం తప్పింది. బాధితులు తమ వివరాలను వెల్లడించేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. వాహనాన్ని క్రేన్ సహాయంతో రోడ్డు పక్కకు తరలించారు.

నారసింహా నమోస్తుతే

- ఘనంగా నారసింహుని బ్రహ్మరథోత్సవాలు, కల్యాణోత్సవాలు
- పులకించిన భక్తులు


రొళ్ల: భక్తుల గోవింద నామస్మరణ మధ్య సాగుతున్న రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం


పావగడ: భక్తజనసందోహం మధ్య సాగుతున్న కణివె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కనుల పండువగా బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వెండి, బంగారు ఆభరణాలతో పాటు పంచలోహ కవచాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహామంగళ హారతి ఇచ్చిరు. అనంతరం రథం ముందు వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రధాన ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో కూర్చొబెట్టారు. అనంతరం రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అరటి పండ్లు, పూలు, తమల పాకులు, బురుగులు తదితర వాటిని భక్తులు రథంపై విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక ప్రాంతంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

బ్రహ్మోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన బ్రహ్మరథోత్సవానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేడు కొండపై దివ్యజ్యోతి దర్శనం

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రొళ్ల కొండపై వెలసిన ఉగ్రనరసింహస్వామి ఆలయంలో దివ్యజ్యోతి దర్శనం కార్యక్రమంతో పాటు వసంతోత్సవం, భక్తులచే ధాన్యం సేకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పావగడ: కణివె లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మరథోత్సవం కనుల పండువగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. నారసింహుడు రథారూఢుడై వేలాది మంది భక్తుల మధ్య సాగుతుండగా భక్తి పారవశ్యంతో భక్తులు పరవశించిపోయారు. నరసింహస్వామి గోవింద.. గోవింద.. అన్న భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథోత్సవం సాగింది. ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో ఆలయం నుంచి నరసింహస్వామి విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రథంలో ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రథంపైకి అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సమితి అధ్యక్షుడు మాధవన్, కార్యదర్శి శ్రీకృష్ణ, ట్రెజరర్ నరసింహనాయక, ధర్మ కర్త సుబ్బనరసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా కల్యాణోత్సవం

హిందూపురం: కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీకంఠపురం, నింకంపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకంఠపురం ఆలయంలో మూలవిరాట్ లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మరోవైపు నింకంపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకొని విశేష పూజలు, కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. లక్ష్మీనరసింహస్వామిని మహావిష్ణువు రూపంలో అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. శ్రీకంఠపురం, మేళాపురం ప్రసన్న లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో మూలవిరాట్ నరసింహస్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. అలాగే కళ్యాణ వేదికపై లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భక్తుల సమక్షంలో కల్యాణోత్సవాలు నిర్వహించారు.


హిందూపురం: అలంకరణలో నింకంపల్లి లక్ష్మీనరసింహస్వామి


హిందూపురం: శ్రీకంఠపురం లక్ష్మీనరసింహస్వామి


రొళ్ల: అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

భక్తిశ్రద్ధలతో కదిరి పున్నమి వేడుకలు

పరిగి: ప్రతి ఏటా హోళీ పండుగ రోజు నిర్వహించే కదిరి పున్నమి వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. పరిగి, ధనాపురం, శ్రీరంగరాజుపల్లి తదితర గ్రామాల్లో నరసింహస్వామి ఆలయాల్లో స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ధనాపురంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో కలిసి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


రొళ్ల: బ్రహ్మోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


చిలమత్తూరు: కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


చిలమత్తూరు: పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి


చిలమత్తూరు: రథోత్సవంలో పాల్గొన్న ఎంపీ గోరంట్ల మాధవ్

ఉచిత శిక్షణతో ఉపాధి

హిందూపురం టౌన్: ఎకో సంస్థ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు రీటైల్ సేల్స్ అసోసియేటివ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఉస్మాన్ పేర్కొన్నారు. బుధవారం నుంచి కోర్సు ప్రారంభమవుతుందని, 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు మహిళలు కోర్సులో చేరడానికి అర్హులన్నారు. స్థానిక సప్తగిరి కళాశాలలో 40 రోజులపాటు సాగే శిక్షణలో ఉచిత వసతి, భోజనం, శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 7816007821కు సంప్రదించాలని కోరారు.

కైవారం తాతయ్య విశ్వ గురువు


తాతయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, బలిజ సంఘం సభ్యులు

పావగడ: కోలార్ జిల్లా కైవారంలో వెలసిన త్రికాల జ్ఞాని కై వారం తాతయ్య (యోగి నారాయణ స్వామి) కేవలం బలిజ కులానికే చెందిన వారు కాదని విశ్వ గురువని తహసీల్దార్ సుజాత తెలిపారు. పట్టణంలోని యోగి నారాయణస్వామి దేవాలయంలో తాతయ్య స్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య చిత్రపటం వద్ద పూజలు చేసి నివాళులర్పించారు.

సోమందేపల్లి: సోమందేపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం కై వారం తాతయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. సజ్జగంట రంగనాథస్వామి బలిజ సంక్షేమ సంఘం నాయకులు పులివెందుల నారాయణస్వామి, సూర్యనారాయణ, తిప్పన్న, నవీన్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భంభం బాబా ఆరాధనోత్సవం


భం కబీర్ కిరణ్ స్వామిని దర్శించుకున్న అనంతపురం ఎంపీ తలారి రంగయ్య

పావగడ: తాలూకాలోని కేతగానకెరె సేవాలాల్ పుర గ్రామంలో సద్గురు భం షేక్ అబ్దుల్లా స్వామి, సద్గురు భం అన్వరానంద బాబా ఆరాధానోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భం కిరణ్ స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన అనంతపురం ఎంపీ తలారి రంగయ్య స్వామి వారి ఆశీస్సులు పొందారు.

అభివృద్ధికే పట్టం కట్టండి


పెనుకొండ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం చాలకూరు, సోమందేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు.

పెనుకొండ రూరల్: త్వరలోనే జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు అభివృద్ధికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అమ్మవారిపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమ్మవారిపల్లితో పాటు గుట్టురూలో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు.

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎన్నికల అభ్యర్థి రామచంద్రారెడ్డి విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక లోటస్ పాఠశాల, సువర్ణభారతి, దీక్షా కళాశాలల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. అలాగే రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్ వాల్మీకి, వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు విస్తృతంగా ప్రచారం చేశారు.

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్ ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో భాగంగానే పట్టణంలో జోరుగా ప్రచారం నిర్వహించారు.

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మెదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని పట్టభద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఆమె నాయకులతో కలిసి కదిరేపల్లి, హారేసముద్రం, బుళ్లసముద్రం, మెళవాయి, భక్తరహల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హిందూపురం: సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలమని జీవనజ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్, నెహ్రూ యువ కేంద్రం సభ్యురాలు నాగజ్యోతి, పద్మజ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ పద్మజ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

మడకశిర: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మడకశిరలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

గుడిబండ: మండంలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పక్కాగా అమలు చేయాలని జెడ్పీటీసీ భూతరాజు ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిని పరిశీలించారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని హాలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 2023 -24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. 5వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 24 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: 2023–24వ సంవత్సరానికి గాను 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల రొద్దం ప్రిన్సిపాల్ పీఎం. గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. అర్హులు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిరుద్యోగులకు వరంగా మారిందని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా మంగళవారం తన ఇంటి ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే తిప్పేస్వామి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమ్మిట్‌లో దాదాపు 340 ఎంఓయూలు జరిగాయన్నారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. వైఎస్ జగన్ కృషితోనే రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. త్వరలోనే 6 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయని పేర్కొన్నారు. లోకేశ్ పాదయాత్రకు జనం కరువయ్యారని, దీంతో రెండు లేదా మూడు నెలల్లోపే లోకేశ్ పాదయాత్రకు బ్రేక్ పడతుందని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. చంద్రబాబు ఓటమిని ముందే గుర్తించి ముఖ్యమంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మడకశిర నియోజకవర్గంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఈశ్వర్, మాజీ ఎంపీపీ బజ్జప్ప, వైస్ ఎంపీపీ మూర్తి, నాయకులు జయరాజ్, దాసన్న, తదితరులు పాల్గొన్నారు.